# రైతుల హక్కులపై పెప్సి కంపెనీ దాడి

## దేశ నామమాత్ర సార్వభౌమత్వానికి కూడా ముంచుకొస్తున్న ముప్పు

**ప్రపంచ** వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఆవిర్భవించిన తర్వాత ఇండియా సభ్యదేశంగా డబ్ల్యుటిఒకి సంబంధించిన 'టిఆర్ఐపిఎస్'(ట్రిప్స్) అగ్రిమెంట్‌పై సంతకం చేసింది. దీనివల్ల మనదేశ పాలకులు మరింతగా రాజీపడవలసి వస్తోంది. అలాగే నిరంతరం ముప్పును ఎదుర్కోవాల్సివస్తోంది. దేశ 'సార్వభౌమాధికారమే' తీవ్ర ప్రమాదంలో పడింది.

అమెరికా బహుళజాతి సంస్థయొక్క అనుబంధ కంపెనీయైన పెప్సికో ఇండియా గుజరాత్‌లోని నలుగురు బక్క రైతులను కోర్టుకీడ్చింది. తాను హక్కులు పొందిన 'లేస్' తయారీకి వుపయోగపడే ప్రత్యేక బంగాళ దుంపలను ఈ రైతులు పండిస్తున్నారని, నష్టపరిహారంగా ప్రతి రైతు తనకు 1.5 కోట్ల రూపాయలు చెల్లించాలని ఆ కంపెనీ అహ్మదాబాద్‌లోని వాణిజ్య కోర్టులో దావా వేసింది. ఆ రైతులు సదరు వంగడం (ఎఫ్‌సి బంగాళాదుంప) సాగుచేయడానికి వీల్లేదని ఈ కోర్టు ఏకపక్షంగా మధ్యంతర తీర్పునిచ్చింది. ఈతీర్పులో అనేక ఆందోళనకర అంశాలున్నాయి. ఈ తీర్పు మనరైతుల విత్తన సార్వభౌమాధికారానికి, మన ప్రజల ఆహార సార్వభౌమత్వానికి అంతిమంగా మనదేశ సార్వభౌమత్వానికి పెనుముప్పుగా పరిణమిస్తోంది.

ఇక్కడ వివిధ వంగడాల రక్షణ మరియు రైతుల చట్టం-2001 (పిపివి అండ్ ఎఫ్ఆర్ చట్టం) అనబడే ఈ చట్టం అమలులో చట్టపరమైన మరియు న్యాయపరమైన అంశాల గురించి ఎదురయ్యే సమస్యకంటే సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు మనదేశంయొక్క, మన రైతులయొక్క, మన ప్రజలయొక్క సార్వ భౌమత్వాన్ని దెబ్బతీయడమే మనముందున్న ప్రధాన సమస్య.

స్థానిక విత్తన వ్యాపారులనుండి ఆ బంగాళాదుంప వంగడాన్ని కొని సాగుచేసిన రైతులను, పై చట్టంలోని కొన్ని నిబంధనలను అడ్డంపెట్టుకొని పెప్సికో వేధిస్తోంది.

పెద్ద బహుళజాతి సంస్థలు ముఖ్యంగా అమెరికా బహుళజాతి కంపెనీలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో తమ యిష్టారాజ్యంగా నీతిబాహ్య వ్యాపార పద్ధతులకు పాల్పడుతున్న విషయం బహిరంగ రహస్యమే.

జాన్సన్ & జాన్సన్ కంపెనీ తన అధీన సంస్థలద్వారా భారతదేశంలో తన వైద్య ఉత్పత్తులను అమ్ముకోవడంలో ఎంతటి నీతిబాహ్య చర్యలకు పాల్పడిందో మనం చూశాం. అలాగే మోన్‌శాంటో కంపెనీయొక్క అధీన సంస్థ 'మహికో' ఈ దేశంలో చట్టవ్యతిరేకంగా ప్రవేశించి, తన బిటి వంకాయలను అనధికారికంగా పండించి, అమ్ముకున్న వైనం మనందరికీ తెలిసిందే. ఇటీవలనే వాల్‌మార్ట్ కంపెనీ సంబంధిత ప్రభుత్వ అధికారులకు లంచాలు యిచ్చి తన వ్యాపారాన్ని అంతర్జాతీయంగా విస్తరించుకోడానికి అనుమతులు పొందడంలాంటి నీతిబాహ్య కుట్రపూరిత చర్యలు బహిర్గతమయ్యాయి. ఈ బహుళజాతి కంపెనీలు తమకున్న భారీ పెట్టుబడిశక్తితో, ఆధిపత్యంతో వీటి బారినపడ్డ దేశాల ప్రజలహక్కులను, సార్వభౌమాధికారాన్ని హరిస్తూ, ఆ దేశాలను సర్వనాశనం చేస్తూ వాటితో ఆడుకుంటున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా రూపొందిన 'ట్రిప్స్' ఒప్పందం వీటికి స్వతంత్ర దేశాల సార్వభౌమాధికారాన్ని నిర్వీర్యపరిచే అవకాశాల నిస్తోంది.

అమెరికా దిగ్గజ అనుబంధ కంపెనీయైన పెప్సికో తన శీతల పానీయాల వ్యాపారంతో బాటు ఆహార పదార్థాల తయారీ వ్యాపారాన్ని కూడా చేస్తోంది. 'లేస్' చిప్స్ తయారీకి వాడే 'ఎఫ్-సి-5' రకం బంగాళాదుంప వంగడాన్ని 2009లో అది ఈ దేశానికి తెచ్చింది. సహకార వ్యవసాయంపేర 12000 మంది రైతులు ఈ వంగడాన్ని సాగుచేస్తున్నారు. ఈ వంగడం విత్తనాలను రైతులకు సరఫరా చేయడానికి, వారు పండించిన పంటను కొనుగోలు చేయడానికి ప్రత్యేకమైన ఒప్పందాలను రైతులతో ఈ కంపెనీ చేసుకుంది. ఈ వంగడాన్ని, పిపివి & ఎఫ్ఆర్ చట్టంక్రింద పేటెంటు హక్కులను ఈ కంపెనీ రిజిష్టరు చేసుకుంది. 2010లో ఈ వ్యాపారం ద్వారా 2727 కోట్ల రూపాయలను గడించింది. 2015లో కేవలం 'లేస్' చిప్స్ అమ్మడం ద్వారానే మనదేశ మార్కెట్ నుండి 6000 కోట్ల రూపాయలు లాభాలు గడించింది.

తన సహకార వ్యవసాయ ఒప్పందంలో భాగస్వాములు కాని రైతులు కొందరు గుజరాత్‌లో ఈ వంగడాన్ని పండిస్తున్నట్లు పెప్సికో తెలుసుకుంది. పిపివి & ఎఫ్ఆర్ చట్టం క్రింద తన హక్కులు ఉల్లంఘన జరిగిందని, తనకు జరిగిన భారీ నష్టానికి పరిహారం చెల్లించాలని ఆ చిన్న రైతులపై కేసులు పెట్టింది. గుజరాత్‌లోని వాణిజ్య న్యాయస్థానం కనీసం రైతుల వాదనలను కూడా వినకుండా ఏకపక్షంగా తీర్పునిచ్చింది.

ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దక్షిణకొరియా, యూరోపియన్ యూనియన్ దేశాలలోని సన్నకారు రైతులపై 'పెప్సికో' ఇలాంటి కేసులు పెట్టి దెబ్బతీస్తోంది. రైతుల హక్కుల రక్షణకు జరిగే ప్రయత్నాలు పట్టుచిక్కని వ్యవహారంగా మారిపోయాయి. చివరకు యిప్పుడు రైతుల హక్కులు, సార్వభౌమత్వమే ప్రమాదంలో పడ్డాయి.

ఒక భారతీయ న్యాయస్థానం భారతీయ రైతులకు వ్యతిరేకంగా మొత్తం పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష తీర్పులను ఎలా యిస్తుందనేది అర్థంగాని విషయం. దీన్నిబట్టి భారతీయ న్యాయస్థానాలు ఈ కేసుల్లో వున్న కీలకమైన పరిస్థితుల జోలికి పోకుండా, వాటిని పట్టించుకోకుండా యాంత్రికంగా చట్ట పరిమితుల్లోనే వ్యవహరిస్తున్న తీరు మనకు తెలుస్తోంది.

నీతిబాహ్యమైన విధానాలతో దుర్బలురైన రైతులను వేధించటంద్వారా పెప్సీ కంపెనీ 'ఏవిధంగా' లాభాలు గడించాలనుకుంటుందో ఈ ఉదంతం తెలియజేస్తోంది. 'కార్పొరేట్ జవాబుదారీతనం' వంటి బడాయి నినాదాలన్నీ ఎంతటి డొల్లవో ఈ ఉదంతం వెల్లడిచేస్తోంది.

ఇంతటి నీచమైన వ్యవహారాలు బయట ప్రపంచానికి తెలిసిన తర్వాత కూడా పెప్సికో తాను యిదంతా సహకార బంగాళాదుంప సాగులో భాగస్వాములుగా వున్న రైతుల ప్రయోజనాల పరిరక్షణకోసమేనని, చివరి అస్త్రంగా న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డామని వాదిస్తోంది. ఇంతకంటే నయవంచన ఏమైనా వుంటుందా!?

కానీ, ఈ అర్థంలేని కేసును రైతులపై రుద్దినపుడు మనదేశంలో సార్వత్రిక ఎన్నికల వాతావరణం వుండడం, సోషల్ మీడియాలో పెల్లుబికిన కోపం, దేశవ్యాప్తంగా వచ్చిన ప్రజల నిరసన, వివిధ రైతుసంఘాల నుండి ఎదురైన ప్రతిఘటన, అత్యధిక రాజకీయ-పార్టీలు కంపెనీ చర్యను ఖండించడం, ముఖ్యంగా ఈ దేశంలో తనకున్న భారీవ్యాపారం, వ్యాపార ప్రయోజనాలు, భారతీయ మార్కెట్‌నుండి భారీ లాభాలు పొందే అవకాశాలతోబాటు భారతదేశంలో ఆ కంపెనీ ఉత్పత్తుల కొనుగోలును బహిష్కరిస్తామనే హెచ్చరికలు-'పెప్సికో'ను రైతులపై తను పెట్టిన కేసులు ఉపసంహరించుకొని వెనక్కు తగ్గేట్లు చేశాయి.

అయినా సంబంధిత రైతులకు యిది ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. తిరిగి ఆ కంపెనీ అర్థంపర్థం లేని సాకులతోనో, చట్టపరమైన విషయాలనో ఆధారం చేసుకొని రైతులపై దాడిచేసే అవకాశముంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే విత్తనాల సార్వాభౌమాధి పత్యం, ఆహార సార్వభౌమాధిపత్యం, మొత్తంగా మనదేశ సార్వభౌమాధిపత్యంపై ముప్పు ముంచుకొస్తున్నది.

ప్రపంచ వాణిజ్య సంస్థ విసిరిన అసమాన ఒప్పందాల వల నుండి మనదేశం నిర్ణయాత్మకంగా, రాజీలేకుండా బయటపడాల్సి వుంది. అప్పటివరకు ఈ ఒప్పందాల రూపంలో రైతులే కాదు, మనదేశ ప్రజలు, వారి హక్కులు వారి విస్తృత ప్రయోజనాలతోబాటు మన ఆర్థిక స్వాతంత్ర్యం, బహుళజాతి కంపెనీల భారీ పెట్టుబడుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ వాటి ఉచ్చులో మగ్గాల్సి వుంటుంది.

oooo